క్లుప్తంగా

సందెరాళ్ల పోటీలు



కేటీదొడ్డి: వాల్మీకి జయంతిని పురస్కరించుకొని గురువారం మండల కేంద్రంలో వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి సందెరాళ్ల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ జిల్లా నాయకుడు బాసు హనుమంతునాయుడు హాజరై సందెరాళ్ల పోటీలను ప్రారంభించారు. ఈ పోటీలో మొదటి బహుమతి రంగస్వామి రూ. 3,016, రెండో బహుమతి శ్రీనివాసులు రూ.2,016, మూడో బహుమతి మల్లు రూ.1,516 నగదు గెలుచుకున్నారు.

జిల్లా మహాసభల వాల్‌పోస్టర్ విడుదల



రాజోళి: జిల్లా కేంద్రంలో ఈనెల 25, 26 తేదీల్లో నిర్వహించే సీపీఎం మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి విజయ్‌కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీపీఎం ఆధ్వర్యంలో తుమ్మిళ్ల ఎత్తిపోతల, భారత్‌మాల రహదారిలో భాగంగా భూములు కోల్పోతున్న రైతుల సమస్యలపై పోరాటం చేస్తామన్నారు.

వేంకటేశ్వరస్వామి కల్యాణం



అయిజ: మండలంలోని ఉత్తనూరు ధన్వంతరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. పండితులు వేద మంత్రాలు జపిస్తూ శాస్త్రోక్తంగా శ్రీదేవి, భూదేవితో వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని కనులపండువగా నిర్వహించారు. అనంతరం స్వామివారి రథోత్సవం చేశారు. భక్తులకు ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

గోమాతకు పూజలు



శాంతినగర్: పౌర్ణమి పర్వదినాన్ని గో ప్రచారక్ సేవాసమితి ఆధ్వర్యంలో స్థానిక శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయంలో గురువారం సాయంత్రం గోమాతకు మహిళలు పూజలు నిర్వహించి పశుగ్రాసం అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు శాంత, లలిత, దొంతుకుమారి, దొంతుభవాని, సుభాషిణి, ధనలక్ష్మి, గుంతలక్ష్మి, రాజలక్ష్మి, మానస, బాదం మానస, ప్రవళిక, మాధవి, అనురాధ, శశికళ పాల్గొన్నారు.

నిందితులకు రిమాండ్

చిన్నంబావి: అమాయక ప్రజలను స్కీంల పేరుతో మోసం చేసి డబ్బులు కాజేసిన ఐదుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్‌ఐ రమేష్ తెలిపారు. చిన్నంబావి మండలంలో తిరుమల ఎంటర్ ప్రైజెస్ పేరుతో లక్కీ డ్రా అని ప్రజలను మోసం చేసిన ఐదుగురు నిందితులను గురువారం అరెస్టు చేసి కోర్టులో హాజరపర్చగా.. వారిని రిమాండ్‌కు పంపినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు ఇంకా ఏమైనా ఉంటే తమకు సమాచారం ఇవ్వాలని, ప్రజలను మోసం చేసే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

అమరచింత: సమస్యలను పరిష్కరించాలంటూ మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం ఎంఈఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా తెలంగాణ ప్రగతిశీల మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ ప్రతినెల బిల్లులు ఇవ్వాలని, జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. వర్కర్స్‌కు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. మెస్, గుడ్డు బిల్లులు పెంచాలంటూ ఎంఈఓ భాస్కర్‌సింగ్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు గోవిందమ్మ, సంధ్య, రాజమ్మ, కృష్ణమ్మ, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.



అయిజలో ఎమ్మెల్యే విజయుడు



బస్వల్‌చేర్వులో జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత



మల్దకల్‌లో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి



అలంపూర్‌లో..

వాల్మీకి మహర్షి ఆదర్శప్రాయుడు



రాజోళి తహసీల్దార్ కార్యాలయంలో..



గంగిమాన్‌దొడ్డిలో..

సాక్షి, నెట్‌వర్క్: వాల్మీకి జీవిత చరిత్రను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని, హైందవ ధర్మాన్ని విశ్వసించే వారు రామాయణం తప్పనిసరిగా చదవాలని ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, విజయుడు, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం వాల్మీకి జయంతిని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అనంతరం యువకులు పుర వీధుల్లో ర్యాలీలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గద్వాల మండలంలోని బస్వాల్‌చేర్వులో వాల్మీకి విగ్రహావిష్కరణ చేశారు. గట్టు మండలంలోని గంగిమాన్‌దొడ్డిలో వాల్మీకి నూతన ఆలయం ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ వైస్ చైర్పర్సన్ సరోజమ్మ, బహుజన సేన జిల్లా అధ్యక్షుడు దానయ్య, తహసీల్దార్లు నరేందర్, రామ్మోహన్, మార్కెట్ యార్డ్ చైర్మన్ నల్లా హనుమంతు, వేదపండితులు రమేషాచారి, రవిచారి, నాయకులు రఘుపతినాయుడు, మాజీ జెడ్పీటీసీలు బాసు శ్యామల, పద్మావెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అయిజలో వాల్మీకి మహర్షికి పూజలు చేస్తున్న ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్



బైరంపల్లిలో..



వడ్డేపల్లి మున్సిపాలిటీ పైపాడులో..



మానవపాడులో..



ధరూరులో..



జూలెకల్‌లో..



ఇటిక్యాలలో..

మున్సిపల్ కమిషనర్‌ను నియమించండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయుడు

అయిజ: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కొంత కాలంగా ఇన్‌చార్జ్ కమిషనర్ విధులు నిర్వహిస్తున్నారని, ఆయన స్థానంలో కొత్త కమిషనర్‌ను నియమించాలని మున్సిపల్ పాలకవర్గం అలంపూర్ ఎమ్మెల్యే విజయుడిని కోరారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పాలకవర్గం ఎమ్మెల్యేకు తమ సమస్యలను వివరించారు. వడ్డేపల్లి మున్సిపల్ కమిషనర్ అయిజలో ఇన్‌చార్జ్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తుండడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. స్పందించిన ఎమ్మెల్యే మున్సిపాలిటీలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు.

బాలల సంరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న సురేష్

ధరూరు: బాలలందరూ సురక్షిత వాతావరణంలో పెరిగేందుకు అందరూ సహకరించాలని బాలల సంరక్షణ కౌన్సిలర్ సురేష్ అన్నారు. గురువారం మండలంలోని అల్వాలపాడులో స్త్రీశిశు సంక్షేమ శాఖ వారి బాలల సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు బాలల వేధింపుల నిరోధక చట్టం 2012పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాలలపై ఏ విధమైన వేధింపులు, అకృత్యాలు, హింస జరగకుండా చూడాలన్నారు. వేధింపులకు గురయ్యే బాలికలు 100కు లేదా 1098కు కాల్ చేసి న్యాయం పొందాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తులసీరాం, చైల్డ్‌లైన్ సిబ్బంది నవీన్, అంగన్‌వాడీ టీచర్లు అనంతమ్మ, లక్ష్మి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని వినతి



తహసీల్దార్ జ్యోతికి వినతిపత్రం అందజేస్తున్న కళాశాలల యాజమాన్యం

అయిజ: ప్రైవేట్ డిగ్రీ, పీజీ కాలేజీల నిరవధిక బంద్‌లో భాగంగా ఫీజురీయింబర్స్‌మెంట్ చేయాలని కోరుతూ వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లు గురువారం తహసీల్దార్ జ్యోతికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మూడేళ్ల నుంచి ప్రభుత్వం ఫీజురీయంబర్స్‌మెంట్‌ను విడుదల చేయలేదని వాపోయారు. గత ప్రభుత్వం కొన్ని నిబంధనలు చేసి ట్రెజరీ ద్వారా టోకెన్లను ఇచ్చినా.. ఇంత వరకు దానికి సంబంధించిన డబ్బు విడుదల కాలేదన్నారు. కళాశాల నిర్వహణ కోసం తీసుకున్న అప్పులు, వడ్డీలు, అధ్యాపకుల జీతాలు, కళాశాల భవనాల అద్దెలు, ఇతర నిర్వహణ ఖర్చులు తదితర వాటితో కళాశాలల యాజమాన్యం అనేక ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. ప్రభుత్వం వెంటనే ఫీజురీయంబర్స్‌మెంట్‌ను అందజేయాలని కోరారు. కార్యక్రమంలో బస్వరాజు, వేణు, వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఫీజు బకాయిలు చెల్లించాలి

ఉండవెల్లి: మండలంలోని అలంపూర్ చౌరస్తాలోని డిగ్రీ కళాశాల యాజమాన్యం తహసీల్దార్ కార్యాలయంలోని సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీరెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం మురళీధర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కోటీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

బాలపీర్ల దర్గా అభివృద్ధికి రూ.కోటి మంజూరు



దర్గాలో మంత్రి జూపల్లి కృష్ణారావు తదితరులు

రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

పాన్‌గల్: మండల కేంద్రం సమీపంలోని బాలపీర్ల దర్గాలో మౌలిక వసతుల కల్పనకు రూ.కోటి మంజూరు చేస్తున్నట్లు రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రకటించారు. గురువారం సాయంత్రం మండల కేంద్రంలోని మహబూబ్ సుభాని దర్గాను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్న బాలపీర్లా దర్గాను అన్నివిధాలుగా అభివృద్ధి చేయాలని, మోడల్‌గా తీర్చిదిద్దాలని స్థానిక నాయకులకు సూచించారు. అంతకుముందు గ్రామానికి చెందిన యాదవ సంఘం ఆధ్వర్యంలో దర్గా వద్ద కందూరు చేసి గ్రామస్తులకు అన్నదానం చేశారు. మంత్రి వెంట రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, మండల నాయకులు రవికుమార్, రాముయాదవ్, బ్రహ్మయ్య, భాస్కర్‌యాదవ్, బాలరాజుయాదవ్, మైనార్టీ నాయకులు జైనుల్లా, ఖలీల్, ఇలియాస్ తదితరులు ఉన్నారు.

ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు

ధరూరు: ఆర్టీసీ బస్సు డ్రైవర్‌ను దుర్భాషలాడిన వ్యక్తిపై రేవులపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రం నుంచి ఆర్టీసీ బస్సు ఆత్మకూరుకు వెళ్తుండగా.. గురువారం మధ్యాహ్నం 12.40 గంటల సమయంలో బస్సు ముందు వెళ్తున్న ఆటో డ్రైవర్ సయ్యద్ వసీం ఆటోను బస్సుకు అడ్డంగా ఆపి డ్రైవర్ చిన్నారెడ్డిని దుర్భాషలాడారు. దీంతో తన విధులకు ఆటంకం కలిగించిన ఆటో డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని బస్సు డ్రైవర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ షకూర్ తెలిపారు.

ప్రభుత్వ భూముల్లో నర్సరీలు ఏర్పాటు చేయాలి

అలంపూర్ రూరల్: గతేడాది ప్రభుత్వ, ప్రైవేట్ భూముల్లో నర్సరీలు ఏర్పాటు చేశారని, కానీ ఈ ఏడాది ప్రభుత్వ భూముల్లోనే నర్సరీలు ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ పద్మావతి అన్నారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం నర్సరీల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీ యొక్క గ్రీన్ ప్లాన్ తయారు చేసుకోవాలని ఆదేశించారు. గ్రామానికి కావల్సిన మొక్కల రకాలు, వాటి సంఖ్య గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ రాజు, పంచాయతీ కార్యదర్శులు, టీఏలు సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఉండవెల్లి: మండల కేంద్రంతో పాటు అలంపూర్ చౌరస్తాలోని ఆలయాల్లో పౌర్ణమి సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలో ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి పల్లకీ సేవ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు ఆంజనేయ శర్మ, ధర్మకర్త దామోదర్‌రెడ్డి, గురుస్వామి సూర్యకాంతారెడ్డి, మాలధారులు శివ, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పారదర్శకంగా చేపట్టాలి

ఆత్మకూర్: ప్రభుత్వం చేపట్టనున్న ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు, ఎంపికలపై పూర్తి పారదర్శకంగా కార్యక్రమాలను చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు అన్నారు. గురువారం స్థానిక మార్కెట్‌యార్డులో సీపీఐ మండల కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి లబ్ధిదారుల ఎంపిక కమిటీల్లో అన్ని పార్టీల వారికి ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. అలాగే మండలంలోని గ్రామాల్లో సమస్యలు తాండవం చేస్తున్నాయని, గ్రామ సభలు ఏర్పాటు చేసి అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లాకార్యదర్శి శ్రీహరి, మండల కార్యదర్శి రాబర్టు, నాయకులు సీఎనొట్టి, లింగన్న, ఆంజనేయులు, బాలకృష్ణ, మహేందర్, బాలరాజు, భీమన్న, చెన్నప్ప, గోవర్ధన్ ఉన్నారు.

ఎల్వోసీ అందజేత



బాధితుడికి ఎల్వోసీ కాపీ అందజేస్తున్న రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి

వనపర్తి రూరల్: పెబ్బేరు మండలంలోని పెంచికలపాడుకు చెందిన రజినిబాబు అనారోగ్యంతో బాధపడుతూ.. వైద్య ఖర్చుల కోసం ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నారు. ఈ విషయాన్ని గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు శేఖర్ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన రూ.5 లక్షల ఎల్వోసీని మంజూరు చేయించి, కాపీని గురువారం హైదరాబాద్‌లో బాధితుడికి అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్‌యాదవ్, పట్టణ అధ్యక్షుడు వెంకట్రాములుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మదనాపురం వంతెన పనులు పూర్తి చేయాలి

వనపర్తి: జిల్లాలో రోడ్లు భవనాల శాఖ ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనులు పూర్తి చేయడంలో వేగం పెంచాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులకు సూచించారు. మదనాపురం వంతెన పనులు త్వరగా పూర్తి చేయాలని, ఆర్‌అండ్‌బీ ఇంజినీర్‌ను ఆదేశించారు. కేడీఆర్ పాలిటెక్నిక్ కళాశాల వెనుక భాగంలో వసతి గృహాల ఏర్పాటుకు సంబంధించిన మరమ్మతు పనులు చేపట్టాలన్నారు. వనపర్తి బైపాస్ రోడ్డు కోసం 8 కిలోమీటర్ల భూసేకరణపై గూగుల్ ఎర్త్ ద్వారా పరిశీలించారు. ఘనపూర్ రోడ్డు విస్తరణలో భాగంగా రోడ్డుపై ఉన్న దర్గా, ఆలయం తొలగించి పనుల్లో వేగం పెంచాలని సూచించారు. బిజినేపల్లి రోడ్డు విస్తరణలో భాగంగా మిగిలిపోయిన పనులు పూర్తి చేయాలన్నారు. పాన్‌గల్ రోడ్డు విస్తరణకు సంబంధించి భూసేకరణపై చర్యలు తీసుకోవాలని, ఆక్రమణలు చేసిన వారికి నోటీసులు జారీ చేయాలన్నారు. అదేవిధంగా పెబ్బేరు రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

మెడిసిన్ స్టోర్ భవనం పరిశీలన

మర్రికుంట సమీపంలో నిర్మిస్తున్న మెడికల్ కళాశాల వద్ద రూ.2.6కోట్ల వ్యయంతో నిర్మించిన నూతన సెంట్రల్ మెడిసిన్ స్టోర్ భవనాన్ని కలెక్టర్, అదనపు కలెక్టర్ పరిశీలించారు. భవనం వినియోగంలోకి తీసుకురావడానికి గల ఇబ్బందులపై కాంట్రాక్టర్‌ను ప్రశ్నించారు. పనులు పూర్తి అయినప్పటికీ కేవలం రోడ్డు మార్గం సరిగ్గా లేనందున పెండింగ్‌లో ఉంచినట్లు కాంట్రాక్టర్ తెలిపారు. జిల్లాకు నేరుగా రావాల్సిన మెడిసిన్ స్టోర్ లేకపోవడం వల్ల మహబూబ్‌నగర్ జిల్లాకు వెళ్లి అక్కడి నుంచి జిల్లాకు రావడానికి తీవ్ర ఆలస్యం అవుతుందన్నారు. రోడ్డుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి ఇవ్వాలన్నారు. రోడ్డు పూర్తి చేసి పది రోజుల్లో భవనం వినియోగంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.

వైభవంగా పాండురంగస్వామి బ్రహ్మోత్సవాలు



పాండురంగస్వామి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఆత్మకూర్: మండలంలోని మూలమళ్లలో శ్రీపాండురంగస్వామి బ్రహ్మోత్సవాలు వైభోవపేతంగా కొనసాగించి, స్వామివారి రథోత్సవం కనులపండువగా నిర్వహించారు. అలాగే స్వామివారి ఊరేగింపులో భజనమండలి ఆధ్వర్యంలో కీర్తనలు ఆలపించారు. ప్రత్యేక పూజలు, మహామంగళహారతి, ప్రసాద వితరణ చేశారు. ఆలయప్రధాన అర్చకుడు శ్రీధర్‌జ్యోషి, నిర్వాహకులు యుగంధర్‌రెడ్డి, నారాయణరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, వినయ్‌కుమార్ రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, ఆనంద్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, భీమన్న, రాజశేఖర్‌రెడ్డి భక్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేల పూజలు..

శ్రీపాండురంగస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, రాష్ట్ర గీతకార్మిక డిపార్ట్‌మెంట్ చైర్మన్ కేశం నాగరాజుగౌడ్ వేర్వేరుగా ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఆలయ అర్చకులు ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలను శేష వస్త్రాలతో సత్కరించి తీర్థప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో అయ్యూబ్‌ఖాన్, రహ్మతుల్లా, పరమేష్, తులసీరాజ్, నల్గొండశ్రీను, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



ప్రాజెక్టు ఆఫీసులో వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

వనపర్తి రూరల్: పెండింగ్‌లో ఉన్న ఐదు నెలల వేతనాలు వెంటనే విడుదల చేయాలని గురువారం తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ జిల్లా యూనియన్ సీఐటీయూ అనుబంధంతో వనపర్తి జిల్లా కేంద్రంలోని ప్రాజెక్టు కార్యాలయం ఎదుట మినీ అంగన్‌వాడీ టీచర్లు ధర్నా చేశారు. అనంతరం అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్టా ఆంజనేయులు మాట్లాడుతూ మినీ అంగన్‌వాడీ టీచర్లు 2024లో అనేక సందర్భాలుగా దశల వారిగా వారు పోరాటాలు నిర్వహించగా ఫలితంగా జిల్లాలోని 42 మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలుగా గుర్తిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. 2024 జనవరిలో రాష్ట్ర ప్రభుత్వం టీచర్లుగా ప్రమోషన్ ఇచ్చి నేటికీ ఆ ప్రమోషన్, జీతాలు చెల్లించలేదన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధ్యక్షురాలు జ్యోతి, ప్రధాన కార్యదర్శి నారాయణమ్మ, సుమతి, టీచర్లు కవిత, లక్ష్మి, పుష్పలత, చంద్రకళ, సరిత, లక్ష్మి, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.